క్లుప్తంగా

కొబ్బరి పీచు పరిశ్రమ సందర్శన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న మౌనిక

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణంలోని సత్యనారాయణ కొబ్బరి పీచు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వ క్వాయర్ బోర్డు సంస్థలో శిక్షణ పొందుతున్న మహిళలు శుక్రవారం సందర్శించారు. పరిశ్రమ వ్యవస్థాపకులు మౌనిక ఆధ్వర్యంలో నిరుపయోగమైన కొబ్బరి పీచుతో మహిళలకు వివిధ రకాల బొమ్మల తయారీ శిక్షణ మహిళలకు వివరించారు. బొమ్మల తయారీ ఒకటే కాకుండా కొబ్బరిపొట్టుతో డి కంపోస్ట్ తయారు చేసి మొక్కలకు ఎరువుగా వాడవచ్చని అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన మెరుగుపరుచుకునేలా పరిశ్రమ ద్వారా అవకాశాలను కల్పిస్తున్నట్లు నిర్వాహకులు మౌనిక తెలిపారు. కార్యక్రమంలో బోర్డు ప్రోగ్రామ్ మేనేజర్ ప్రసాద్, శిక్షకురాలు మీనా, మహిళలు, ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొట్టంగా డబుల్ ఇళ్లు


పశువులను కట్టేసిన దృశ్యం

పుల్‌కల్(అందోల్): నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో పశువులు సావాసం చేస్తున్నారు. గత ప్రభుత్వం పుల్‌కల్‌లో 48 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో పశువుల కొట్టంగా వాడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లబ్ధిదారులకు పట్టాలు అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా పోషణమాసం


బతుకమ్మ ఆడుతున్న టీచర్లు, అధికారులు

రాయికోడ్(అందోల్): పోషణమాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. సీడీపీఓ అంజమ్మ హాజరై పోషణ మాసం నిర్వహణ ఉద్దేశం వివరించారు. పిల్లలు, తల్లులకు పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులు, మహిళల్లో పోషణ లోపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మ ఆడి సంతోషంగా గడిపారు. వివిధ పోషకాలు కలిగిన పండ్లు, కూరగాయాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, నీరజ గ్రేసీ, వివిధ గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో చండీహోమం


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వర దేవస్థానంలో 5వ రోజు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఓడి బియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో గౌతమ్, మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హోమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10 గేట్లు ఎత్తివేత



పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు రెండు రోజుల నుంచి వరద పోటెత్తటంతో 10 క్రస్టుగేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ నీరంతా డ్యాంలోకి చేరుతోంది. డ్యాంలో 17 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి దిగువకు 88623 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పది గేట్లు ఎత్తడంతో పర్యాటకులు సందడి చేస్తున్నారు.

మహాలక్ష్మిదేవిగా..


సంగారెడ్డి: ఇస్మాయిల్ ఖాన్ పేట ఆలయంలో..


జిన్నారం(పటాన్‌చెరు): కామేశ్వరిదేవిగా..


న్యాల్‌కల్(జహీరాబాద్): పంచవటి క్షేత్రంలో..

దేవీనవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం ఐదవ రోజు అమ్మవారు మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు హోమాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఐలమ్మ స్ఫూర్తిదాయకం

పోరాట యోధురాలు ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత అన్నారు. రజాకర్ల ఆకృత్యాలను, ఆగడాలను నిరసిస్తూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముందు వరుసలో నిలిచిన మహనీయురాలన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనన్నారు.


సంగారెడ్డి జోన్: ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జగదీశ్, తదితరులు


జిన్నారం(పటాన్‌చెరు): నివాళులర్పిస్తున్న కమిషనర్ వెంకటరామయ్య


పుల్‌కల్(అందోల్): పుల్‌కల్‌లో..


పటాన్‌చెరు టౌన్: నివాళులర్పిస్తున్న నీలం మధు


కంగ్టి: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన అధికారులు

పాఠశాల ప్రిన్సిపాల్స్ సదస్సు ప్రారంభం

పటాన్‌చెరు: సమాజంలో అంతరించిపోతున్న నీతి, విలువలను పాఠశాలలో బోధించాలని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. మండలంలోని రుద్రారం గీతం యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో జాతీయ పాఠశాల ప్రిన్సిపాల్స్ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ (పీఎస్‌పీఏ) సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు(కోలిక్వియం)లో దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ, ఐబీ, జాతీయ పాఠశాలలకు చెందిన 150 మంది ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. పాఠశాల నుంచి స్థిరమైన ఉపాధి వరకు -ప్రయాణంలో ఉన్న అవరోధాలతో పాటు వివిధ అంశాల వారీగా ఉపన్యాసకులు ప్రసంగించారు. తొలి రోజున పాఠశాల స్థాయి నుంచి స్థిరమైన ఉపాధి వరకు ప్రయాణంలో ఉన్న అవరోధాలపై చర్చించారు. 2047కి అభివృద్ధి చెందిన భారత్‌ను రూపొందించడం, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలను సమన్వయం చేయడం' అనే అంశంపై గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ప్రసంగించారు. తదుపరి తరం శాస్త్రవేత్తలను పెంపొందించడం, పాఠశాలల్లో ఉత్సుకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడం' అనే అంశంపై ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ సయ్యద్ ప్రసంగించారు. 'బలమైన పునాదులను నిర్మించడం, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల భవిష్యత్తును ఎలా రూపొందిస్తాయి' అనే అంశంపై లోక్ సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు. గీతం అధ్యక్షుడు శ్రీభరత్ సదస్సులో రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను వివరించారు. పీఎస్‌పీఏ (ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్) అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ స్వాగత ఉపన్యాసం చేశారు.


సదస్సును ప్రారంభిస్తున్న బోధమయానంద

మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు

- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- జీవో విడుదల చేసిన అధికారులు

సంగారెడ్డి: ప్రభుత్వం మద్యం పాలసీ 2025–27లో భాగంగా అధికారులు టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయగా జిల్లాల జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, గౌడ సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ మీడియాకు వెల్లడించారు. అయితే కొత్త వైన్ షాపులు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 253 వైన్ షాపులున్నాయి. ఇందులో సంగారెడ్డి జిల్లాలో 101 వైన్ షాపులకుగాను ఎస్సీ లకు 13, ఎస్టీలకు రెండు, గౌడలకు తొమ్మిది షాపులు కేటాయించామని తెలిపారు. ఇంకా 77 షాపులు ఓపెన్ కేటగిరీకి కేటాయించామన్నారు. వివరాల కోసం 984994470,08455276385 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెంట్ నవీన్ చంద్ర, సీఐలు నజీర్ పాషా, సాగర్, తదితరులున్నారు.

రేపు కవి సమ్మేళనం

నారాయణఖేడ్: ఖేడ్ రసగీతి సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉ.10 గంటల నుంచి హైదరాబాద్ సుచిత్ర సర్కిల్‌లోని శ్రీరామ్ గార్డెన్ జైన్ అపార్ట్‌మెంట్ క్లబ్ హౌజ్‌లో తాను సంకలనపర్చిన 'మిలీనియం మహనీయులు' గ్రంథావిష్కరణ, 'విజయదశమి వైభవం' కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్షుడు మహారెడ్డి మహిపాల్ రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, తెలుగు విశ్వవిద్యాలయ పూర్వరిజిస్ట్రార్ గౌరీశంకర్, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి, ఆత్మీయ అతిథులుగా నివర్తి మోహన్‌కుమార్, జి.లక్ష్మీనారాయణ, యాసీన్ మొహ్మద్, రఘువీర్ ప్రతాప్ హాజరవుతుండగా వి.జయప్రకాష్ గ్రంథ సమీక్ష చేస్తారన్నారు. రాష్ట్ర పద్యసారస్వత పీఠం అధ్యక్షుడు అవుసుల భానుప్రకాష్ సభాధ్యక్షుడు, సమన్వయకర్తగా వ్యవహరిస్తారని వివరించారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా బాల్‌రాజు

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ముదిమాణిక్యం గ్రామానికి చెందిన మ్యాతరి బాల్‌రాజ్‌ను నియమించారు. ఈమేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర మాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. మాదిగల అభివృద్ధికి కృషి చేస్తానని బాల్‌రాజ్ తెలిపారు.

సత్వర ఉద్యోగాలకు డిప్లొమా బాట

జేఎన్‌టీయూ రెక్టార్ పుల్లయ్య

పటాన్‌చెరు: డిప్లొమా విద్యార్థులకు వందశాతం ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సాంకేతిక విద్యా శిక్షణ కార్యదర్శి ఎ.పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం పటాన్‌చెరు ఎల్లంకి కళాశాలలో నిర్వహించిన ఉద్యోగమేళాలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక విద్యతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ విజయ్ కుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ.. తెలంగాణ రైజింగ్ 2047 గొప్ప ఫలాలు ఇవ్వనుందన్నారు. జాబ్ మేళాలో రెండు వేల పోస్టులను భర్తీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. చెన్నై బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ అండ్ ట్రైనింగ్‌తో ఎల్లంకి కళాశాల ఎంఓయూను చేసుకుంది. ఎల్లంకి విద్యా సంస్థల చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అప్రెంటిస్‌షిప్, ట్రైనింగ్ స్కీమ్ తమ కళాశాలను వరించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సాధారణ డిగ్రీ విద్యార్థులకు కూడా ఉద్యోగాలు లభించాయన్నారు.


జాబ్‌మేళాలో పాల్గొన్న విజయ్‌కుమార్‌రెడ్డి, పుల్లయ్య, సదాశివరెడ్డి

అంబరాన్నంటిన సంబరాలు

జిల్లాలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఈ పలువురు మాట్లాడుతూ. తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలకు బతుకమ్మ అద్దం పడుతుందన్నారు.


సంగారెడ్డి టౌన్: జిల్లా కోర్టులో..


జహీరాబాద్ టౌన్: బతుకమ్మఆడుతున్న విద్యార్థులు


రామచంద్రాపురం: బతుకమ్మ ఆడుతున్న సింధు

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బీహెచ్‌ఈఎల్ టౌన్షిప్‌కు చెందిన షేక్ ఇబ్రహీం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మంజూరు రూ. 2.50లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, శ్రీధర్‌చారి, చంద్రశేఖర్, రామిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం హద్నూర్ కళాశాలలో పోషకుల సమావేశం (పేరెంట్స్ మీటింగ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులు ఉంటారని అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో బోధిస్తున్నారని తెలిపారు. కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ఉచిత బస్ పాస్, పాఠ్యాపుస్తకాలు, ఉపకార వేతనాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా ద్వారా ఎంసెట్, నీట్, జేఈఈలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఉచిత కోచింగ్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులను రెగ్యులర్‌గా కళాశాలకు పంపాలని పోషకులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కళాశాల కమిటీ చైర్మన్ రేణుక, అధ్యాపకులు సదాలక్ష్మి, జగదీశ్వర్, అర్జున్, శ్రీనివాస్, స్వర్ణలత, యాదగిరి, సోనీ, కవిరాజు, సిద్దయ్య, బాలారాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


న్యాల్‌కల్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

పిల్లల సామర్థ్యాలపై చర్చించాలి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి గోవిందరాం నాయక్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా ఇంటర్మీడియట్ జిల్లా ప్రత్యేక అధికారి కిషన్, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి గోవిందరాం నాయక్‌లు హాజరై మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలకు తరచుగా వస్తూ తమ పిల్లల సామర్థ్యాలపై అధ్యాపకులతో చర్చించాలన్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో దానిని మంచి మార్గంలో వాడుకునేలా పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు.


పటాన్‌చెరుటౌన్: మాట్లాడుతున్న గోవిందరాం

టైలరింగ్ శిక్షణతో ఉపాధి: ఎంపీడీఓ

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలోని ఇందిరా క్రాంతి భవనంలో నెల రోజుల నుంచి మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. చివరి రోజు శుక్రవారం ఎంపీడీఓ సత్తయ్య పరిశీలించి మహిళలను అభినందించారు. ఎస్‌బీఐ సంగారెడ్డి వారి రిసెట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిక్షణలో 29 మంది మహిళలు శిక్షణ పొందినట్లు డైరెక్టర్ రాజేశ్, కోఆర్డినేటర్ నర్సింలు, శిక్షకురాలు ఈస్టార్ రాణి తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఏపీఎం శ్రీనివాస్‌తో పాటు సీసీలను ఎంపీడీఓ అభినందనలు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తే వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎంపీడీఓ ఆశాభావం వ్యక్తం చేశారు.


కంగ్టిలో టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య

భారీ వర్షం .. ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు


వాహనదారులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ, సీఐ

పటాన్‌చెరు టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి జాతీయ రహదారిపై వరద నీరు భారీగా చేరడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. భారీగా వరద నీరు రావడంతో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే రహదారి, సంగారెడ్డి వైపు నుంచి పటాన్‌చెరు వచ్చే రహదారిపై రెండు వైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అయితే ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు సూచనలు ఇస్తూ వాహనాలను మళ్లించారు. మరోవైపు ముత్తంగి నుంచి రుద్రారం వెళ్లేందుకు రెండు గంటల సమయం పట్టిందని వాహనదారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రజలు వర్షాల కారణంగా పనులను వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతేనే వాహనాలు తీసుకుని బయటికి రావాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ చర్యలు తీసుకోండి

సంగారెడ్డి జోన్: ప్రేమించి పెళ్లి చేసుకొని భార్యను వదిలేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన ఓ యువతి, మరో వర్గానికి చెందిన యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి వారి సంప్రదాయాలు పాటించకపోవడంతో తనను వదిలేసినట్లు తెలిపారు.

◆ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించండి

పుల్‌కల్(అందోల్): గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వర్తించే పార్టుటైం ఉపాధ్యాయులు, అధ్యాపకులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ గురుకులల్లో విధులు నిర్వర్తించే తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా, బతుకమ్మల పండగల నేపథ్యంలో ఇంటి ఖర్చులు పెరిగాయని అన్నారు. అధికారులు స్పందించి జీతాలు సక్రమంగా వచ్చేలా చూడాలని కోరారు.

◆ నేడు సామాజిక తనిఖీ సమావేశం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రక్రియను శనివారం ఉ. 9:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ బృందం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధులపై సమీక్షించడం జరగనుందన్నారు. కార్యదర్శులు, ఇంజినీరింగ్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, సిబ్బంది సకాలంలో పాల్గొనాలని కోరారు.

◆ వైభవంగా లలితాంబికా తులాభారం

నారాయణఖేడ్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ శివారులోని లలితాంబికాదేవి ఆలయం ఆవరణలో శుక్రవారం అమ్మవారికి వైభవంగా తులాభారం నిర్వహించారు. అమ్మవారు లక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహానికి ఆలయ వ్యవస్థాపకులు శ్రీపంతులు ఆధ్వర్యంలో గురురాజశర్మ పర్యవేక్షణలో అభిషేకాలు, అలంకరణ, హారతి, కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం భక్తులు తీసుకొచ్చిన బెల్లం, పండ్లు, నాణేలు, ధాన్యంతో తులాభారం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

◆ నేడు ఏటీసీ సెంటర్ ప్రారంభోత్సవం

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర ఐటీఐ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన (ఏటీసీ)అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి తెలిపారు. ముఖ్యఅతిథిగా మంత్రి దామోదర, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్, అధికారులు హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.